సాక్షి
సంగారెడ్డి

శనివారం, 28, అక్టోబర్, 2023



నాడు సేవ.. నేడు వ్యాపారం

ఆ నాటి రాజకీయాలకూ... నేటి రాజకీయానికి చాలా వ్యత్యాసం ఉందని 'రామాయంపేట' మాజీ ఎమ్మెల్యే అంతిరెడ్డిగారి విఠల్‌రెడ్డి అన్నారు.

వివరాలు 10లో ▸



'ముత్తూట్'లో చోరీకి యత్నం

నారాయణఖేడ్ పట్టణంలోని ముత్తూట్ ఫైనాన్స్ బ్రాంచ్‌లో ఇద్దరు దుండగులు చోరీకి యత్నిం చారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వివరాలు 10లో ▸



బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి..

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం అన్నారు.

వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

నేడు కేతకి ఆలయం మూసివేత



శ్రీకేతకి సంగమేశ్వరాలయం

ఝరాసంగం(జహీరాబాద్): పాక్షిక చంద్రగ్రహణం కారణంగా దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగంలోని శ్రీకేతకి సంగమేశ్వర ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఆలయ ఈఓ శశిధర్ శుక్రవారం తెలిపారు. శనివారం మధ్యాహ్నం మూసివేసి ఆదివారం ఉదయం సంప్రోక్షణ అనంతరం 6 గంటల నుంచి దర్శనానికి అనుమతిస్తామన్నారు. భక్తులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

రేపు జిల్లాకు మల్లికార్జున ఖర్గే రాక



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదివారం జిల్లాకు రానున్నారు. సంగారెడ్డితో పాటు, మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో ఆయన పర్యటన కొనసాగనుంది. తొలి విడత అభ్యర్థుల జాబితాను ప్రకటించిన కాంగ్రెస్ ఇకపై ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు శనివారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా విజయభేరీ బస్సుయాత్రను ప్రారంభించనుంది. యాత్ర సంగారెడ్డితో పాటు, నర్సాపూర్, మెదక్ నియోజకవర్గాల మీదుగా కొనసాగుతుందని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ అభ్యర్థులు, ఆ పార్టీ శ్రేణులు కసరత్తు చేస్తున్నారు. సంగారెడ్డి అభ్యర్థి, ఎమ్మెల్యే జెగ్గారెడ్డి సంగారెడ్డి ఖర్గే పర్యటనను ధ్రువీకరించారు. బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు జనసమీకరణ చేయాలని నిర్ణయించారు.

మరో సైబర్ మోసం

పటాన్‌చెరు టౌన్: ఫోన్ పోగొట్టుకున్న బాధితుడి బ్యాంక్ ఖాతా నుంచి సైబర్ మోసగాళ్లు నగదు కాజేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం పటాన్‌చెరు పట్టణంలోని సీతారాంపూర్ కాలనీకి చెందిన ఓ వ్యక్తి ఈనెల 22వ తేదీన పటాన్‌చెరు మార్కెట్‌కు వెళ్లాడు. అక్కడ గుర్తు తెలియని వ్యక్తులు అతడి ఫోన్ అపహరించారు. బాధితుడు ఆ రోజంతా ఫోన్ కోసం వెతికి కొత్త సిమ్ తీసుకున్నాడు. సిమ్ యాక్టివేట్ కాగానే బాధితుడి బ్యాంక్ ఖాతా నుంచి పలు దఫాలుగా రూ.2.47 లక్షలు నగదు డెబిట్ అయినట్లు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో బాధితుడు ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, శుక్రవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఆ పార్టీలకు బుద్ధి చెప్పండి


ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెలంగాణ వ్యతిరేక పార్టీలకు బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పిలుపు ఇచ్చారు. శుక్రవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల నాగులపల్లిలో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మూడోసారి కేసీఆర్ ప్రభుత్వం రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలు రావడంతో మరోసారి ప్రజలను అమలు సాధ్యం కాని వాగ్దానాలతో మోసం చేసేందుకు కొన్ని రాజకీయ పార్టీలు ప్రణాళికలు రూపొందించాయని తెలిపారు. అటువంటి పార్టీలను తరిమి కొట్టాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు గడప గడపకు వెళ్లి వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ప్రతీ కార్యకర్త 30 రోజులపాటు సైనికుడిలా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. మరోసారి ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లారెడ్డి, తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, తెల్లాపూర్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్, స్థానిక సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

హస్తం సైతం రెడీ..



ఆవుల రాజిరెడ్డి
(నర్సాపూర్ నియోజకవర్గం)

పుట్టిన తేదీ : 27-03-1973
భార్య : శైలజ
కుమారుడు : రిత్విక్‌రెడ్డి
తల్లిదండ్రులు: ప్రేమలత - కీ.శే. నారాయణరెడ్డి
విద్యార్హతలు : బీఎస్సీ, ఎల్‌ఎల్‌బీ
మాసాయిపేట గ్రామం, మండలం, నర్సాపూర్ నియోజకవర్గం



చెరుకు శ్రీనివాస్‌రెడ్డి
(దుబ్బాక నియోజకవర్గం)

పుట్టిన తేదీ: 19-4-1971
స్వగ్రామం: తుక్కాపూర్
తల్లిదండ్రులు: విజయలక్ష్మి - కీ.శే. ముత్యంరెడ్డి, మాజీ మంత్రి
భార్య: అర్పిత
పిల్లలు: నేహా, రావల్‌రెడ్డి
విద్యార్హతలు: ఎంబీఏ, ఫైనాన్స్ (ఐసీబీఎం యూనివర్సిటీ ఢిల్లీ)



పొన్నం ప్రభాకర్
(హుస్నాబాద్ నియోజకవర్గం)

పుట్టిన తేదీ: 08-05-1967
స్వస్థలం: కరీంనగర్
తండ్రి పేరు: సత్తయ్య గౌడ్
విద్యార్హతలు: ఎంఏ, ఎల్‌ఎల్‌బి
పదవులు: పీసీసీ ట్రెనింగ్ కమిటీ చైర్మన్ (ప్రస్తుతం)
-మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ (టీ పీసీసీ)



పూజల హరికృష్ణ
(సిద్దిపేట నియోజకవర్గం)

పుట్టిన తేదీ : 15- 06-1981
స్వస్థలం: సిద్దిపేట పట్టణం
భార్య : శైలజ
కుమారులు: ఇద్దరు
తల్లిదండ్రులు: జమున-బాలకృష్ణ
విద్యార్హతలు : ఎంఏ, ఎల్‌ఎల్‌బీ
పదవులు: 2022 నుంచి పీసీసీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు

రెండో జాబితాలో నాలుగు చోట్ల ఖరారు

- నర్సాపూర్ నుంచి ఆవుల రాజిరెడ్డి
- హుస్నాబాద్ బరిలో పొన్నం..
- సిద్దిపేటలో పూజల హరికృష్ణ
- దుబ్బాక నుంచి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి
- పెండింగ్‌లోనే పటాన్‌చెరు, నారాయణఖేడ్.

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన రెండో జాబితాలో ఉమ్మడి మెదక్ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు టిక్కెట్లు ఖరారు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 45 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్.. ఇందులో నర్సాపూర్, హుస్నాబాద్, సిద్దిపేట, దుబ్బాక నుంచి బరిలోకి దిగనున్న అభ్యర్థులను ప్రకటించింది. ఈనెల 15న ప్రకటించిన తొలి జాబితాలో ఐదుగురికి చోటు దక్కిన విషయం విదితమే. ఏకాభిప్రాయం రాని, కొత్త నేతల చేరికలున్న పటాన్‌చెరు, నారాయణఖేడ్ నియోజకవర్గాల అభ్యర్థిత్వాలను ఇంకా పెండింగ్‌లోనే పెట్టింది.

రాజిరెడ్డికి నర్సాపూర్..

నర్సాపూర్ టికెట్ చివరికి పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డికే దక్కింది. ఈ టికెట్ కోసం పీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనీల్‌కుమార్‌ల మధ్య పోటాపోటీ నెలకొంది. రెడ్డిపల్లి ఆంజనేయులు, సోమన్నగారి రవీందర్‌రెడ్డి సైతం దరఖాస్తు చేసుకున్నారు. కానీ పీసీసీ ఆవుల రాజిరెడ్డితో పాటు, గాలి అనీల్‌కుమార్ పేర్లను ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీకి పంపింది. బీసీ సమీకరణాల నేపథ్యంలో టికెట్ దక్కుతుందని అనీల్‌కుమార్ భావించారు. చివరకు నిరాశే ఎదురైంది.



చెరుకుకు దక్కిన దుబ్బాక..

దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్ పీసీసీ కార్యదర్శి, నియోజకవర్గం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి కేటాయించారు. పీసీసీ ఉపాధ్యక్షుడు శ్రావణ్‌కుమార్‌రెడ్డి, అధికార ప్రతినిధి కత్తికార్తిక కూడా ఆశించారు. స్థానికంగా అందుబాటులో ఉండటం, తన తండ్రి మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి ఇమేజ్ కలిసి రావడంతో కాంగ్రెస్ నాయకత్వం శ్రీనివాస్‌రెడ్డి వైపు మొగ్గు చూపింది. ఇక్కడి ఎమ్మెల్యే రామలింగారెడ్డి మరణంతో వచ్చిన ఉప ఎన్నికల్లో శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన విషయం విదితమే.

పొన్నంకు కలిసొచ్చిన విధేయత..

హుస్నాబాద్ అభ్యర్థిత్వాన్ని కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌కు ఖరారు చేసింది. పార్టీ పట్ల ఉన్న విధేయత, బీసీ సామాజిక సమీకరణాలు తదితర అంశాలు పొన్నంకు కలిసొచ్చాయి. మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి కూడా టికెట్ ఆశించారు. వీరిద్దరితో పాటు మరో ముగ్గురు నాయకులు కూడా దరఖాస్తు చేసుకున్నారు. కానీ ప్రవీణ్ రెడ్డి, పొన్నంల పేర్లు మాత్రమే ఏఐసీసీ పరిశీలనకు వెళ్లాయి. కరీంనగర్ ఎంపీగా పనిచేసిన పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ పెద్దలతో సన్నిహిత సంబంధాలున్నాయి. తెలంగాణ ఉద్యమంలో, పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లుకు ఆమోదం వంటి సమయాల్లో పొన్నం కీలకంగా పనిచేశారు. ఇవన్నీ పొన్నంకు దోహదపడ్డాయని పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. కాగా ఈ హుస్నాబాద్ స్థానాన్ని పొత్తులో భాగంగా సీపీఐ ఆశించింది. ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పోటీ చేయాలని భావించారు. కానీ సీపీఐకి చెన్నూరు, కొత్తగూడెం కేటాయించే అవకాశాలుండటంతో పొన్నం ప్రభాకర్‌కు టికెట్ ఖరారు చేసింది.

సిద్దిపేట బరిలో పూజల

సిద్దిపేట టికెట్ పీసీసీ కార్యదర్శి పూజల హరికృష్ణకు కేటాయించారు. పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం, మహిళా నాయకురాలు భవానీరెడ్డి కూడా టికెట్ ఆశించిన వారిలో ఉన్నారు. అధినాయకత్వం హరికృష్ణకు అవకాశం కల్పించింది. మంత్రి హరీశ్ రావు పోటీ చేస్తున్న సిద్దిపేటలో రాష్ట్ర స్థాయిలోని కీలక నాయకుడిని బరిలోకి దించుతారనే ప్రచారం జరిగింది. కానీ హరికృష్ణకే టికెట్ ఖరారు చేశారు.



ఏకాభిప్రాయం లేక..
ఆ రెండు పెండింగ్..

- నీలం మధు చేరికతో నిలిచిన పటాన్‌చెరు అభ్యర్థిత్వం
- నారాయణఖేడ్ టిక్కెట్టుపై కుదరని ఏకాభిప్రాయం

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి : ఉమ్మడి మెదక్ జిల్లాలో పటాన్‌చెరు, నారాయణఖేడ్ నియోజకవర్గాల అభ్యర్థిత్వాలను కాంగ్రెస్ అధినాయకత్వం పెండింగ్‌లో ఉంచింది. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా 45 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించి ఈ రెండు స్థానాల టిక్కెట్లను ప్రకటించలేదు. మొత్తం 11 స్థానాలకుగాను తొలి జాబితాలో ఐదుగురికి చోటు దక్కగా, రెండో జాబితాలో నాలుగు టిక్కెట్లను ఖరారు చేసింది. పటాన్‌చెరు టిక్కెట్టు కోసం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న కాటా శ్రీనివాస్‌గౌడ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనీల్‌కుమార్ ఆశిస్తున్నారు. అయితే ఇటీవల బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన చిట్కుల్ సర్పంచ్ నీలం మధు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే సమక్షంలో ఢిల్లీలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దీంతో ఈ టిక్కెట్టు రేసులో ఇద్దరితో పాటు, నీలం మధు పేరు పరిశీలనలోకి వచ్చింది. కాగా తనకు అభ్యర్థిత్వం ఖరారు చేస్తే కాంగ్రెస్‌లో చేరుతానని నీలం మధు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఈ ముగ్గురితో చర్చించిన తర్వాతే టిక్కెట్టు ఖరారు చేసే యోచనలో కాంగ్రెస్ అధినాయకత్వం ఉన్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ టిక్కెట్టు విషయమై చర్చించేందుకు ఢిల్లీకి రావాలని కాటా శ్రీనివాస్‌కు అధినాయకత్వం నుంచి పిలుపు కూడా అందినట్లు సమాచారం. ఈ టిక్కెట్టును కాటాకు ఇప్పించేందుకు మాజీ ఉపముఖ్యమంత్రి, సీడబ్ల్యూసీ సభ్యుడు దామోదర రాజనర్సింహ పట్టుబట్టినట్లు తెలుస్తోంది. ముగ్గురు మధ్య సయోధ్య కుదిర్చాకే టిక్కెట్టును ఖరారు చేయాలని ఆ పార్టీ అధినాయకత్వం నిర్ణయించినట్లు సమాచారం.

హస్తినకు 'ఖేడ్' నేతలు

ఏకాభిప్రాయం కుదరకపోవడంతో నారాయణఖేడ్ టిక్కెట్టును కూడా అధినాయకత్వం పెండింగ్‌లో ఉంచినట్లు పార్టీలో ప్రచారం జరుగుతోంది. ఈ టిక్కెట్టు కోసం మాజీ ఎంపీ సురేష్ షెట్కార్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డిల మధ్య తీవ్రపోటీ నెలకొంది. ఇద్దరు కూడా ఈ టిక్కెట్టుపై పట్టు వీడటం లేదు. ఈ టిక్కెట్టు సంజీవరెడ్డికి ఇప్పించేందుకు దామోదర్ రాజనర్సింహ ప్రయత్నం చేస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అధిష్ఠానం వద్ద తనకున్న పరిచయాలతో షెట్కార్ గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం వీరిద్దరు హస్తినకు వెళ్లినట్లు సమాచారం.

రెండు వర్గాలుగా చీలిన కాంగ్రెస్

నారాయణఖేడ్‌లో కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి రెండు వర్గాలుగా చీలిపోయి ఉంది. ఇరు వర్గాలు కలిసి పనిచేస్తేనే ఇక్కడ కాంగ్రెస్ గెలుపు సాధ్యమవుతుందనే అభిప్రాయం రాజకీయవర్గాల్లో ఉంది. ఈ నేపథ్యంలో ఇద్దరు నేతల మధ్య సయోధ్య కుదిర్చాకే ఈ టిక్కెట్టుపై నిర్ణయం ప్రకటించాలని కాంగ్రెస్ అధినాయకత్వం భావిస్తోంది. గతంలో ఈ టిక్కెట్టు విషయంలో ఇదే తరహాలో ఇద్దరి మధ్య పోటీ నెలకొనడంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చారు. షెట్కార్‌ను జహీరాబాద్ ఎంపీగా, సంజీవరెడ్డి తండ్రి కిష్టారెడ్డిని ఎమ్మెల్యే టిక్కెట్టు ఇప్పించి ఇద్దరిని గెలిపించుకున్నారు. మరోవైపు ఇద్దరిలో ఒక టర్మ్ ఒకరు, వచ్చే ఎన్నికల్లో మరొకరు పోటీ చేసేలా వారి మధ్య ఒప్పందం అంశంపై కూడా తెరపైకి వచ్చినట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఇద్దరు నేతలు కూడా గత కొన్ని రోజుల క్రితం ఒకరి నివాసానికి మరొకరు వెళ్లి టిక్కెట్టు విషయంలో మాట్లాడుకోవడం అప్పట్లో స్థానికంగా చర్చనీయాంశమైన విషయం విదితమే. మొత్తం మీద ఈ ఇద్దరు నేతల మధ్య సయోధ్య కుదిర్చిన తర్వాతే ఈ టిక్కెట్టును ఖరారు చేసే యోచనలో కాంగ్రెస్ అధినాయకత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

ఆధారాలు చూపాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు సీజ్ చేసిన నగదు పొందేందుకు జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలోని జిల్లా గ్రీవెన్స్ కమిటీలో ఆధారాలు సమర్పించాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ తెలిపారు. ఇప్పటి వరకు రూ.50 వేలకు మించి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న వారి నుంచి సీజ్ చేసిన 55 కేసులకు సంబంధించి రూ.1,47,87,180 విడుదల చేశామన్నారు. జహీరాబాద్ నియోజకవర్గం చిరాగ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రూ.4,55,46,960 విలువ గల బంగారు ఆభరణాలను సీజ్ చేసి ఆదాయపన్ను అధికారులకు తెలియజేశామన్నారు. స్వాధీనం చేసుకున్న నగదు విషయంలో సందేహాల నివృత్తికి జిల్లా గ్రీవెన్స్ కమిటీ అధికారులను 91001 15691 / 92814 87272 / 77999 34135 సెల్‌ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. సరైన ఆధారాలు చూపి తిరిగి నగదు పొందొచ్చన్నారు. నగదు జప్తు చేసినప్పుడు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం శిక్షణలో భాగంగా ఈవీఎం, వీవీ ప్యాట్ల నిర్వహణపై అవగాహన కల్పించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌ఓ నగేష్, డీసీఓ ప్రసాద్, ఐదు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, డీఎస్పీలు, ఏఆర్వోలు, స్వీప్ నోడల్ అధికారి అఖిలేష్ రెడ్డి, సెక్టోరల్ అధికారులు, ఎఫ్‌ఎస్టీ, ఎస్‌ఎస్‌టీ, వీఎస్‌టీ, సహాయ వ్యయ పరిశీలకులు, మాస్టర్ ట్రైలర్ కృష్ణ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

దళితుల సంక్షేమానికి బీజేపీ గండి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్



సంగారెడ్డి అర్బన్: దళితుల సంక్షేమానికి బీజేపీ గండి కొడుతోందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. ప్రసాద్ అన్నారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా దళిత, గిరిజన మహిళల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమేల మాణిక్ మాట్లాడుతూ బీజేపీ పాలిస్తున్న రాష్ట్రాల్లో అధికంగా దళిత మహిళలపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. డిసెంబర్ 4న చలో ఢిల్లీ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహులు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అశోక్, దళిత సామాజిక సంఘాల సీనియర్ నాయకులు నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

మోసపోతే గోసపడతాం

- కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని నమ్మొద్దు : మంత్రి హరీశ్‌రావు
- వట్‌పల్లిలో ఘనంగా అలయ్-బలయ్



పోతులబొగుడ సభలో ప్రసంగిస్తున్న మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో ఎమ్మెల్యే క్రాంతి

వట్‌పల్లి(అందోల్): కాంగ్రెస్ మాటలను నమ్మితే మోసపోయి గోస పడుతామని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం అందోలు ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో వట్‌పల్లి మండలం పోతులబొగుడలో నిర్వహించిన అలయ్-బలయ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ గోబెల్ ప్రచారాన్ని నమ్మవద్దని చెప్పారు. ఆరు గ్యారంటీ పథకాలని చెప్పి కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు చేతులెత్తేసిందని చెప్పారు. 2009లో ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాల విషయమై ప్రజల్లో మంచి స్పందన వస్తుందని చెప్పారు. 'పల్లె పల్లెనా పల్లేర్లు మొలిచే', 'నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు' అనే పాటలను నేడు తిరగ రాయాల్సిన పరిస్థితులను బీఆర్‌ఎస్ సర్కార్ తీసుకొచ్చిందని గుర్తు చేశారు. బొంబాయి, దుబాయ్ ప్రాంతాలకు వలసలు పూర్తిగా తగ్గాయని చెప్పారు. కాంగ్రెస్ నేతల దుష్ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. సర్వేలన్నీ బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా ఉన్నాయని, కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మోసపోతే గోస పడతామని, ఓటు రూపంలో ప్రజలు నిర్ణయాన్ని వెల్లడించాలని కోరారు. ఎమ్మెల్యే చంటి క్రాంతి స్థానిక నాయకుడని, భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని చెప్పారు. ఎమ్మెల్యే క్రాంతికిరణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానన్నారు. కార్యక్రమంలో టీఎస్‌టీపీసీ చైర్మన్ భిక్షపతి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లంనారాయణ, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్, జోగిపేట మున్సిపల్ చైర్మన్ జి.మల్లయ్య, మార్కెట్ చైర్మన్ సంజీవయ్య, మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ జగన్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, విజయదశమి పండగను పురస్కరించుకొని వట్‌పల్లిలో చేపట్టిన అలయ్-బలయ్ కార్యక్రమం ధూంధాంగా నిర్వహించారు.

కేసీఆర్ తలచుకుంటే సగం మంది కాంగ్రెసోళ్లు జైలుకే..

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పనితనం తప్ప పగతనం తెలియదని మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. ఒకవేళ కేసీఆర్ తలచుకుంటే సగం మంది కాంగ్రెస్ నాయకులు ఇప్పటికే జైళ్లో ఉండేవారని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే ఝూటాకోర్ పార్టీ అని మండిపడ్డారు. 2009లో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ దుష్ట పాలనను చూస్తే ప్రజలకు అర్థమవుతుందని చెప్పారు. కాంగ్రెసోళ్ల గోబెల్ ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దన్నారు. నిజం గడప దాటక ముందే అబద్ధం ఊరంతా తిరిగి వస్తుందని, కళ్ల ముందు ఉన్న అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు. సర్వేలన్నీ బీఆర్‌ఎస్‌కు హ్యాట్రిక్‌కు ఖాయమని చెబుతున్నాయని పేర్కొన్నారు.

మరోసారి గులాబీ జెండా ఎగురవేస్తాం

నర్సాపూర్: ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సమన్వయంతో నియోజకవర్గంలో ప్రచారం చేపట్టి నర్సాపూర్‌లో మరోసారి బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తామని నర్సాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. తనకు బీ ఫామ్ రావడానికి మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, స్థానిక ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఎంతో సహకరించారని తెలిపారు. ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలతో కార్యకర్తల్లో నెలకొన్న సందిగ్ధతను తొలగించేందుకు ఈనెల 29న నర్సాపూర్‌లో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సమావేశానికి మంత్రి హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ.. మంత్రి పాల్గొనే సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామగ్రామానా తిరి గి ప్రచారం చేపడుతామని అన్నారు.

సమష్టి కృషితో విజయం

శివ్వంపేట(నర్సాపూర్) : బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితో విజయం సాధిస్తానని నర్సాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి అన్నా రు. శుక్రవారం సాయంత్రం మండల పరిధి ఉసిరికపల్లిలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు తూము కృష్ణారావు ఆధ్వర్యంలో కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే మెదక్‌ను అభివృద్ధి చేస్తా

కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్ రావు


ఖాసీంపూర్‌లో ప్రచారం చేస్తున్న రోహిత్

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని పలు గ్రామాల్లో మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి రోహిత్‌రావు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. శుక్రవారం ఖాసీంపూర్, ఖాసీంపూర్ తండా, రజాక్‌పల్లి, కల్వకుంట గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మైనంపల్లి హన్మంత్‌రావు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గ్రామాల్లో నీటి సమస్యను తీర్చడానికి బోర్లు వేయించారని గుర్తు చేశారు. ప్రస్తుతం తనను గెలిపిస్తే ప్రజల సమస్యలు తీర్చి మెదక్‌ను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రామచంద్రగౌడ్, గణేష్, మహేందర్, మారుతి, మధుసూదన్ రెడ్డి, మసూద్, వెంకట్ గౌడ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే సబ్బండ వర్గాల సంక్షేమం

బీఆర్ఎస్ అభ్యర్థి గూడెం మహిపాల్ రెడ్డి


మహిపాల్‌రెడ్డితో పద్మశాలి సంఘం నాయకులు

పటాన్‌చెరు: సబ్బండ వర్గాల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆ పార్టీ అభ్యర్థి గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఆయనకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు నియోజకవర్గ పద్మశాలి సంఘం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన ఆ సంఘం నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. 60 ఏళ్లలో సాధ్యం కాని ప్రగతిని సీఎం కేసీఆర్ పదేళ్లలో చేసి చూపించారని తెలిపారు. గతంలో కాంగ్రెస్ పాలకులు నేతన్నలను ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ అశోక్, మల్లేష్, వేముల రమేష్, భాస్కర్, నర్సింలు, సోమదాసు ఉన్నారు.

కేసీఆర్ పాలనలో ఇంటింటికీ పథకాలు

బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్


చింతా ప్రభాకర్‌తో నాయకులు, కార్యకర్తలు

సదాశివపేట(సంగారెడ్డి): కేసీఆర్ పాలనలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని ఆ పార్టీ అభ్యర్థి చింతా ప్రభాకర్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లి గ్రామానికి చెందిన బీసీ సెల్ మండల అధ్యక్షుడు రవికుమార్ 50మంది అనుచరులతో కలిసి పట్టణంలోని ప్రభాకర్ స్వగృహానికి వచ్చి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం ప్రకటించిన మేనిఫెస్టో ప్రతి ఒక్కరికీ ఉపయోగకరంగా ఉందన్నారు. తన గెలుపునకు నియోజకవర్గ ప్రజలందరూ ఏకమవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆంజనేయులు, కృష్ణ, నర్సింలు, భిక్షపతి, రవి, శ్రీరాం, మల్లేశం పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్వేషకర పోస్టులు పెడితే చర్యలు

పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత

సిద్దిపేటకమాన్: సోషల్ మీడియాలో విద్వేషకర, రెచ్చగొట్టే విధంగా, తప్పుడు పోస్టులు పెడితే వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. పోలీసు కమిషనర్ కార్యాలయంలో ప్రత్యేక సోషల్ మీడియా సెల్ ఏర్పాటు చేశామని, ఇక్కడి నుంచి నిరంతరం నిఘా ఉంటుందని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరమైన చిత్రాలు, వీడియాలు పోస్ట్ చేయకూడదని, వ్యక్తిగత దూషణకు దిగడం, బెదిరించడం చేయకూడదని తెలిపారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా రెచ్చగొట్టే ఆరోపణలు చేయకూడదన్నారు. ఎవరైనా ఇలాంటి వాటికి పాల్పడితే సిద్దిపేట పోలీసు కమిషనర్ కంట్రోల్ రూం వాట్సాప్ నంబర్ 8712667100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

కేసీఆర్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలి



నాయకులతో వంటేరు ప్రతాప్‌రెడ్డి

తూప్రాన్: గజ్వేల్ నుంచి మూడో సారి బరిలో నిలిచిన కేసీఆర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని జేపీఆర్ ఫంక్షన్‌హాల్లో బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టపడి పని చేసిన వారిని గుర్తింపు ఉంటుందన్నారు.

జిమ్‌లో మహిళ ప్రసవం

పటాన్‌చెరు టౌన్: జిమ్‌లో ఓ మహిళ ప్రసవించిన ఘటన మండల పరిధిలోని ఇస్నాపూర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ మూసాపేట్‌కు చెందిన మహేష్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం అతని భార్య అరుణ గర్భిణిగా ఉండటంతో సంగారెడ్డిలో ఉన్న అమ్మగారి ఇంటికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కింది. ఇస్నాపూర్ చౌరస్తా సమీపానికి వచ్చేసరికి ఆమెకు పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో తోటి మహిళా ప్రయాణికులు ఆమెను కిందకు దించి, ఆస్పత్రి అనుకుని పక్కనే ఉన్న జిమ్ భవనంలోకి తీసుకెళ్లారు. ఈలోగా ఇస్నాపూర్‌లో ఉన్న ఆమె ఆమె బంధువుకు సమాచారం ఇచ్చారు. అయితే అప్పటికే అరుణకు నొప్పులు అధికమై జిమ్‌లోనే మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. అక్కడ నుంచి ఆమెను 108లో సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నాడు సేవ.. నేడు వ్యాపారం



ఆ నాటి రాజకీయాలకూ... నేటి రాజకీయానికి చాలా వ్యత్యాసం ఉంది. నాడు నిస్వార్థంగా సేవ చేసేవాళ్లం. ఇప్పుడు రాజకీయం వ్యాపారంగా మారింది. కోట్ల రూపాయలు కూడబెట్టుకోవటానికే నాయకులు పుట్టుకొస్తున్నారు. అప్పట్లో బాధ్యతగా పని చేశాం. ఎన్నికల్లో మాట ఇచ్చామంటే దానికి కట్టుబడి ఉండేవాళ్లం. ప్రస్తుతం ఎన్ని కోట్ల రూపాయలు ఖర్చు పెట్టామో అంతకంటే ఎక్కువ సంపాదించాలనే ఆలోచనే నేటి నాయకుల్లో కనిపిస్తోంది. ఈ సారి మెదక్ కాంగ్రెస్ టికెట్ ఇస్తామని గాంధీభవన్ నుంచి ఫోన్ వచ్చినా నా అంతరాత్మ ఒప్పుకోలేదు.

\- మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

- రాజకీయం కోసం ఆస్తులు అమ్ముకున్నాం
- ప్రస్తుతం కోట్లు కూడబెడుతున్న నాయకులు
- ఈసారి మెదక్ కాంగ్రెస్ టికెట్ ఇస్తామన్నా తిరస్కరించా
- రెండుసార్లు ఎమ్మెల్యే, ఒక్కసారి సమితి ప్రెసిడెంట్‌గా..
- 'సాక్షి'తో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

మెదక్: జిల్లాలోని ప్రస్తుతం మాసాయిపేట మండల కేంద్రానికి చెందిన అప్పటి 'రామాయంపేట' మాజీ ఎమ్మెల్యే అంతిరెడ్డిగారి విఠల్‌రెడ్డి 1966 నుంచి 1981 వరకు గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. 1981–1986 వరకు రామాయంపేట సమితి ప్రెసిడెంట్‌గా, అనంతరం 1989 నుంచి 1994 వరకు, 1999 నుంచి 2004 వరకు రామాయంపేట ఎమ్మెల్యే గెలుపొంది పౌల్ట్రీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు. ప్రస్తుత ఎన్నికల తీరు, రాజకీయాలపై విఠల్‌రెడ్డి తన అభిప్రాయాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు.

ప్రత్యేక రాష్ట్రం కోసం త్యాగం

2000లో ప్రత్యేక రాష్ట్రం కోసం తెలంగాణ ఎమ్మెల్యేల ఫోరం ఏర్పాటు చేశామని, స్వరాష్ట్రం కోసం ఎన్నో సార్లు సోనియాగాంధీ విన్నవించామని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్ర నినాదంతో కాంగ్రెస్‌తో టీఆర్ఎస్ పొత్తు పెట్టుకుందని, ఆ పొత్తులో భాగంగా 2004లో రామాయంపేట టికెట్‌ను కాంగ్రెస్–టీఆర్ఎస్ ఉమ్మడి అభ్యర్థిగా పద్మాదేవేందర్‌రెడ్డికి కేటాయించారు. తాను సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ స్వరాష్ట్రం కోసం టికెట్‌ను వదులుకున్నట్లు చెప్పారు. పార్టీ అధికారంలోకి వచ్చాక పొత్తులో సీట్లు వదులుకున్న చాలా మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఎమ్మెల్సీలు ఇచ్చారని, తనకు మాత్రం ఆ అవకాశం దక్కలేదని చెప్పారు.

టికెట్ ఇస్తామని ఫోన్..

మెదక్ నుంచి కాంగ్రెస్ టికెట్ ఇస్తామని సెప్టెంబర్‌లో గాంధీభవన్ నుంచి ఫోన్ వచ్చింది కానీ, రాజకీయాల్లో వచ్చిన మార్పు కారణంగా తిరస్కరించినట్లు విఠల్‌రెడ్డి తెలిపారు. ఆనాడు మంచిచేసే నాయకుడిని గుర్తించి అభిమానంతో ఓటు వేసేవారు... నేడు డబ్బు, మద్యం, మాయ మాటలు చెప్పినవారినే గెలిపిస్తున్నారని తెలిపారు. అందుకే తాను పోటీలో నిలవలేదన్నారు.

స్థిరాస్తులు అమ్ముకున్న..

రాజకీయాల్లో ఉన్నత పదవులు పొందినప్పటికీ సొంతంగా తాను ఏమీ సంపాదించుకోలేదని మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల ఖర్చుకు, కుటుంబ అవసరాల కోసం తన స్వగ్రామంలో ఉన్న 45 ఎకరాల వ్యవసాయ భూమిలో 35 ఎకరాలు అమ్ముకున్నట్లు చెప్పారు. అంతేకాకుండా గ్రామంలోని ఇంటితో పాటు జూబ్లీహిల్స్‌లో ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని సైతం విక్రయించినట్లు పేర్కొన్నారు. పిల్లల చదువు కోసం, పెళ్లిళ్ల కోసం హైదరాబాద్‌లో ఉంటునట్లు తెలిపారు. తనకు ఐదుగురు సంతానం కాగా.. ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు కొడుకులు ఉన్నారని, వారందరి పెళ్లిళ్లు చేసినట్లు చెప్పారు. ఇద్దరు కొడుకుల్లో ఒకరు ఉద్యోగరీత్యా కెనడాలో స్థిరపడగా.. మరో కుమారుడు హైదరాబాద్‌లోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నట్లు తెలిపారు.

అప్పట్లో ఖర్చు రూ.1.50 లక్షలు

అప్పటి ఎన్నికలకు ప్రస్తుతం చాలా వ్యత్యాసం ఉందని, నేడు ఎన్నికలంటేనే డబ్బుతో ముడిపడిన వ్యవహారం అని తెలిపారు. మొదటిసారి 1989లో ఎమ్మెల్యేగా గెలిచిన సమయంలో రూ.1.50 లక్షల ఖర్చు అయిందని, అప్పట్లో అది చాలా ఎక్కువ మొత్తం అన్నారు. ఆ ఎన్నికల్లో 31 వేల మెజార్టీతో తాను గెలుపొందినట్లు విఠల్‌రెడ్డి పేర్కొన్నారు.

ఓటుతో స్థానికేతరున్ని తరిమికొట్టాలి

కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి


ఇంటింటి ప్రచారంలో కొమ్మూరి

మద్దూరు(హుస్నాబాద్): పదేళ్లుగా జనగామ నియోజకవర్గ ప్రజలు స్థానికేతరుని వల్లే ఇబ్బంది పడ్డారని, ఇప్పుడు వచ్చిన మరో స్థానికేతరుడైన పల్లాను ఓటుతో తరిమికొట్టాలని కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని లద్నూరు, లక్కపల్లి, ధర్మారం, మర్మాముల, సలాఖపూర్ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని విమర్శించారు. సీఎం కుటుంబం పదేళ్లుగా రాష్ట్రాన్ని దోచుకుంటూ అప్పుల పాలు చేసిందన్నారు. కాంగ్రెస్ హయాంలోనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి జరిగిందన్నారు. తపస్పల్లి నుంచి సిద్దిపేటకు గోదావరి నీటిని ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరినందుకే తనను పార్టీ నుంచి వెళ్లగొట్టారని తెలిపారు. అంతకుముందు లద్నూరు రామాలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 50 మంది ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి, కమాలకర్, బాలరాజుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో ప్రజా గొంతుకను వినిపిస్తా

బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు


లింగాయిపల్లి తండాలో రఘునందన్‌రావు

దౌల్తాబాద్(దుబ్బాక) దుబ్బాక నుంచి నన్ను మరొక్కసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే అసెంబ్లీలో ప్రజా గొంతుకను వినిపిస్తా అని బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గొడుగుపల్లి, లింగాయిపల్లి తండాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పదేళ్లు ఎంపీగా పని చేసిన కొత్త ప్రభాకర్‌రెడ్డికి మండలంలో ఏ ఊరు ఎక్కడ ఉందో తెలియదని ఎద్దేవా చేశారు. పైసలు ఉన్నోళ్ల ఇంటికి, పెద్ద లీడర్ల ఇంటికి మాత్రమే ఆయన వచ్చిపోతారని విమర్శించారు. ఆయనకు పేదలు అంటే గిట్టదని మండిపడ్డారు. మరోసారి బీఆర్ఎస్‌ను గెలిపిస్తే తెలంగాణ సంపదను మొత్తం కేసీఆర్ కుటుంబం దోచుకుంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవి, కిషన్, ప్రసాద్‌రావు, భూపాల్‌రెడ్డి, రామస్వామిగౌడ్, నర్సింహులు, యాదగిరి, అనిల్‌రెడ్డి, గణేష్ ఉన్నారు.

హామీల అమలు కాంగ్రెస్‌తోనే సాధ్యం

జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్


ఎన్నికల ప్రచారంలో చంద్రశేఖర్

కోహీర్(జహీరాబాద్): ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కాంగ్రెస్ కే సాధ్యమవుతుందని జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని గొడిగార్‌పల్లి, సిద్ధాపూర్, పర్సపల్లి, బడంపేట, మనియార్‌పల్లి, శేడెగుట్ట, గోపినాయక్ తండాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని ఇచ్చిన హామిని కేసీఆర్ నేరవేర్చలేక పోయారన్నారని విమర్శించారు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని మాట మరిచారని మండిపడ్డారు. రుణమాఫీ ప్రకటించి సకాలంలో అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవి, ఉపాధ్యక్షుడు షాకీర్ అలీ, జెడ్పీటీసీ రాందాస్, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు రాచయ్య, రామలింగారెడ్డి, శంశీర్ అలీ, బిక్కమ్‌సింగ్, అశ్రఫ్ అలీ, మోహిసిన్, అంజయ్య, విఠల్ పాల్గొన్నారు.

ఈవీఎంల అప్పగింత

కొండపాక(గజ్వేల్): కొండపాకలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాం నుంచి సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక ఒక్కొక్క నియోజకవర్గానికి 20 ఈవీఎంలను రిటర్నింగ్ అధికారులకు శుక్రవారం కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అందజేశారు. ఈవీఎంలను ఎలా ఉపయోగించాలో అధికారులకు వివరించారు. కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణ అదనపు అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎలక్షన్ సూపరింటెండెంట్ రామేశ్వర్, ఆర్వో అధికారులు గరిమా అగర్వాల్, బెన్ షాలం, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


ఈవీఎంల పనితీరుపై వివరిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

పద్మాదేవేందర్‌రెడ్డికి నిరసన సెగ


పద్మను అడ్డుకుంటున్న పాతూర్ యువకులు

గంగాపూర్‌లో పోడు పట్టాలెప్పుడిస్తారంటూ నిలదీత

హవేళిఘణాపూర్(మెదక్): బీఆర్ఎస్ ప్రచారంలో భాగంగా మండల పరిధిలోని గంగాపూర్ గ్రామానికి వెళ్లిన మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్ రెడ్డికి నిరసన సెగ తాకింది. దరఖాస్తు చేసుకున్నా పోడుభూములు ఇంత వరకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. అలాగే, శమ్నాపూర్ గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యేకి గ్రామ సర్పంచ్ లింగం ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం పాతూర్ గ్రామానికి ప్రచారం నిమిత్తం వెళ్లిన ఆమెను గెలిచినప్పటి నుంచి ఏమి చేశావంటూ యువకులు అడ్డుకున్నారు. అదేవిధంగా మండల పరిధిలోని కొచ్చెరుతండా, స్కూల్‌తండా, ఔరంగాబాద్‌తండా, బ్యాతోల్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మైనంపల్లి హన్మంతరావు ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలో తన కుమారుడిని బరిలోకి దింపి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. నాపై నిరసనలు కాంగ్రెస్ పనే అన్నారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి, శేరి నారాయణరెడ్డి, హన్మంత్‌రెడ్డి, ఆంజనేయులు, కిష్టయ్య పాల్గొన్నారు. మండల పరిధిలోని సర్దన గ్రామానికి చెందిన 50 మంది యువకులు కంతారెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు.

మాట తప్పితే మళ్లీ ఓటు అడగను


తపాస్‌పల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న పల్లా రాజేశ్వర్ రెడ్డి

బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): గజ్వేల్, సిద్దిపేట తరహాలో జనగామ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని, మాట తప్పితే మళ్లీ ఓటు అడగనని జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రసులాబాద్, అయినాపూర్, తపాసుపల్లి, పోసాన్‌పల్లి, గురువన్నపేట గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాను స్థానికుడినేనని, ప్రజలకు ఎల్లప్పుడూ జనగామలోనే అందుబాటులో ఉంటానని అన్నారు. మాయ మాటలు చెబుతూ గ్రామాల్లో తిరుగుతున్న కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. 60 ఏళ్లలో చేయని అభివృద్ధిని, తొమ్మిదేళ్లలో కేసీఆర్ చేసి చూపించారని, మరోసారి కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సిద్దప్ప, కీర్తన, శ్రీరాములు, శ్రీనివాస్, స్వామి, కృష్ణ, శ్రీధర్, మహేష్, విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే హక్కు లేదు

టీఎస్ఎంఎస్ఐడీసీ ఎర్రోళ్ల శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రోళ్ల శ్రీనివాస్

సంగారెడ్డి: కాంగ్రెస్ నాయకులకు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని టీఎస్ఎంఎస్ఐడీసీ ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో ఆయన టీఎస్జీఓ మాజీ అధ్యక్షుడు రాజేందర్, డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యంతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎల్లప్పుడూ ప్రజల మధ్యలో ఉండే నాయకుడు చింతా ప్రభాకర్ ను భారీ మెజారిటీ తో గెలిపించాలని అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన జగ్గారెడ్డి అయిదేళ్లలో ఏనాడూ సంగారెడ్డిలో కనిపించలేదన్నారు. రేవంత్ రెడ్డి మూడు గంటల కరెంట్ చాలని, రైతుబంధు ఆపేయాలనడం సిగ్గు చేటన్నారు. సమావేశంలో నాయకులు మామిళ్ళ రాజేందర్, డాక్టర్ శ్రీహరి, ఐపీ మోహన్, విజేందర్ రెడ్డి, అత్తకూరు నగేష్ ఉన్నారు.

జాతీయ పోటీలకు సిద్దిపేట యువకుడు


సమద్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు

సిద్దిపేటజోన్: ఈనెల 30 నుంచి జమ్మూకాశ్మీర్‌లో జరగనున్న జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో సిద్దిపేట క్రీడాకారుడు అబ్దుల్ సమద్ పాల్గొననున్నాడు. కొంతకాలంగా సిద్దిపేట ఫుట్‌బాల్ స్టేడియంలో ప్రాక్టీస్ చేసిన సమద్ అంచెలంచెలుగా రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు సమద్‌ను సన్మానించారు. మంత్రి హరీశ్‌రావు ముందుచూపుతో సిద్దిపేట పట్టణంలో ఫుట్‌బాల్ స్టేడియం ఏర్పాటు చేయడం వల్ల గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు జాతీయస్థాయిలో ఆడే అవకాశం దక్కించుకున్నారని కోచ్ అక్బర్ పేర్కొన్నారు.

ముత్తూట్ ఫైనాన్స్‌లో చోరీకి యత్నం

- కార్యాలయంలోకి చొరబడిన ఇద్దరు దుండగులు
- సైరన్ మోగడంతో అప్రమత్తమైన స్థానికులు
- ఒకరిని పట్టుకుని పోలీసులకు అప్పగింత


స్థానికులకు పట్టుబడిన అనుమానితుడు

నారాయణఖేడ్: పట్టణంలోని ముత్తూట్ ఫైనాన్స్ బ్రాంచ్‌లో ఇద్దరు దుండగులు చోరీకి యత్నించారు. శుక్రవారం స్థానికులు, ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నారాయణఖేడ్‌లోని హైదరాబాద్ రోడ్డుపక్కన షట్టర్ల పైఅంతస్తులో ముత్తూట్ ఫైనాన్స్ బ్రాంచ్ ఉంది. గురువారం రాత్రి సైరన్ మోగడంతో ఆ రోడ్డులో రాకపోకలు సాగిస్తున్న వారు, స్థానికులు అప్రమత్తమై అక్కడకు చేరుకున్నారు. షెట్టర్లపై అంతస్తు నుంచి ఇద్దరు దుండగులు పారిపోయేందుకు యత్నిస్తుండగా స్థానికులు ఒకడిని పట్టుకున్నారు. వెంటనే పోలీసులకు, ఫైనాన్స్ అధికారులు, సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేసుకున్న పోలీసులు అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఫైనాన్స్ సిబ్బందితో కార్యాలయం తాళం తీయించి సీసీ పుటేజీని పరిశీలించారు. కిటికీ గ్రిల్‌ను ఇనుపరాడ్ వంచడానికి తాపీ మేస్త్రీలు వినియోగించే పరికరంతో విరగొట్టి కిటికీగుండా ఇద్దరు వ్యక్తులు లోనికి ప్రవేశించినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న ఖాతాదారులు కార్యాలయానికి చేరుకున్నారు. చోరీ యత్నం మాత్రమే జరిగిందని, ఏమీపోలేదని ఫైనాన్స్ అధికారులు, సిబ్బంది, ఎస్ఐ తెలపడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు ఢీకొని కూలీ దుర్మరణం

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి చెందినట్లు కుకునూరుపల్లి ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కుకునూరుపల్లికి చెందిన ఎల్లయ్య(47) గ్రామంలోని ఓ బీడీ కంపెనీలో కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈక్రమంలో గురువారం రాత్రి టీవీఎస్ ఎక్సల్‌పై గ్రామంలోని కూతురు ఇంటికి వెళ్లాడు. తిరిగి వస్తుండగా కుకునూరుపల్లి నుంచి ముద్దాపూర్‌కు వెళ్లే క్రాస్ రోడ్డు వద్ద హైదారాబాద్ నుంచి సిద్దిపేట వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలైన ఎల్లయ్యను గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెరువులో జారిపడి వ్యక్తి మృతి

ములుగు(గజ్వేల్): మండలంలోని బండతిమ్మాపూర్‌లో ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి వ్యక్తి మృతి చెందినట్లు ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఝూర్కండ్ రాష్ట్రం కసియాని గ్రామానికి చెందిన పరమేశ్వర బుహియా(44) మూడు నెలల క్రితం బతుకు దెరువు కోసం బండమైలారం వచ్చి కొకోకోలా కంపెనీలో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం ఉదయం బండతిమ్మాపూర్ కోణం చెరువులో పరమేశ్వర బుహియా శవమై తేలాడు. కొత్తూరుకు వెళ్లి తిరిగి వస్తూ చెరువులోని మెట్ల వద్ద కాళ్లు, చేతులు శుభ్రం చేసుకుంటుండగా ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి మునిగి మృతి చెంది ఉంటాడని ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణ కేంద్రానికి చెందిన ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు గాయపడ్డారు. మండల పరిధిలోని ఆకునూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో పనిచేస్తున్న వెంకటేశ్, నర్సయ్య శుక్రవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై చేర్యాలకు వస్తుండగా పట్టణ శివారులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో అకస్మాత్తుగా అడవి పందులు అడ్డువచ్చాయి. వాటిని తప్పించే క్రమంలో ఇరువురు కిందపడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయపడగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

శిథిల ఇంటిని కూల్చుతుండగా..

వ్యక్తికి తీవ్రగాయాలు



ప్రమాదంలో గాయపడిన మోహన్

మనోహరాబాద్(తూప్రాన్): ఇంటిని కూల్చివేస్తుండగా శిథిలాలు మీదపడి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని కొండాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి అలియాస్ గొల్లపల్లి మోహన్ చెందిన ఇల్లు శిథిలావస్థకు చేరుకుంది. దాని కూల్చివేత పనులు చేస్తుండగా ఒక్కసారిగా స్లాబ్ కూలి శిథిలాలు మోహన్ పై పడ్డాయి. తీవ్రంగా గాయపడిన అతన్ని క్రేన్ సహాయంతో బయటకు తీసి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు.

నగదు పట్టివేత

ములుగు/జగదేవ్‌పూర్(గజ్వేల్): ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ. లక్షా 55 వేల నగదును పట్టుకున్నట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపడుతుండగా గజ్వేల్ పట్టణానికి చెందిన వెంకటేశం వాహనంలో 75 వేలు, మంచిర్యాలకు చెందిన శ్రావణ్‌కుమార్ వాహనంలో రూ. 80 వేలు నగదును పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే ములుగు మండలం వంటిమామిడి చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీల్లో రూ. 3 లక్షల 50 వేల నగదు, 13 కిలోల 690 గ్రాముల వెండి పట్టుబడినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

నియామకం



రామారావుకు నియామకపత్రాన్ని అందజేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

పటాన్‌చెరు టౌన్: ఐఎన్‌టీయూసీ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్‌గా గంప రామారావును నియమిస్తూ ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, అఖిల భారత ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి సమక్షంలో శుక్రవారం రామారావుకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామరావు మాట్లాడుతూ కార్మికుల హక్కులపై పోరాడుతానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఓటరు హెల్ప్‌లైన్ 1950

ఓటర్ల సందేహాల నివృత్తికి టోల్ ఫ్రీ ఏర్పాటు

అందుబాటులో ఎనిమిది రకాల సేవలు
- ఫిర్యాదులపై తక్షణ చర్యలు
- సద్వినియోగం చేసుకోవాలన్న అధికారులు



ఓటరు సహాయం కోసం బ్యానర్లు ఏర్పాటు చేసిన అధికారులు

ఫిర్యాదులపై ఆరా తీస్తున్న నోడల్ అధికారి అఖిలేష్ రెడ్డి

సంగారెడ్డి టౌన్: ఎన్నికల సమయంలో ఓటర్లకు వచ్చే సందేహాలను పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా ఉచిత హెల్ప్ లైన్ సెంటర్‌ను ప్రారంభించారు. జిలాల్లో ఐదు నియోజక వర్గాలలో మొత్తం 1,594 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిలాల్లో 13,55,958 మంది ఓటర్లు ఉన్నారు.

ఓటరు సహాయ కేంద్రం

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఓటరు సహాయ కేంద్రం 24 గంటలు పనిచేస్తుంది. 1950 నంబర్‌కు ఫోన్ చేసి తమ సందేహాలు నివృత్తి చేసుకునే విధంగా చర్యలు చేపట్టారు. నిత్యం 60 మంది ఫోన్ చేసి ఫిర్యాదులు చేస్తున్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో సహాయ కేంద్రానికి ఎక్కువగా ఓటరు జాబితాకు సంబంధించిన ఫిర్యాదులే వస్తున్నాయి. దరఖాస్తు చేసినా ఓటరు జాబితాలో పేరు లేదని కొందరు, ఈసారి పోలింగ్ కేంద్రం మారిందని ఇంకొందరు ఫోన్ చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న వారు పోలింగ్ కేంద్రాల చిరునామాకు సంబంధించిన సందేహాలు నివృత్తి చేసుకుంటున్నారు. నవంబరు 3వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుండటంతో ఫిర్యాదుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసిన వారిలో జాబితాలో చోటు దక్కని వారి నుంచి ఫిర్యాదులపై రిటర్నింగ్ అధికారులు వెంటనే స్పందించేలా చూస్తున్నారు. ఈనెల 31వ తేదీతో ఓటరు నమోదు గడువు ముగియనుండటమే దీనికి కారణం.

ఫిర్యాదుల స్వీకరణ

ఓటరు హెల్ప్ లైన్ 1950 ద్వారా ఎనిమిది రకాల సేవల్ని అందిస్తున్నారు. పోలింగ్, ఎన్నికల క్రతువు సజావుగా నిర్వహించేందుకు ఫిర్యాదులు, అభిప్రాయాల స్వీకరణ, ఎన్నికల అధికారికి సంబంధించిన వివరాలు, శాసనసభ నియో జకవర్గ సమాచారాన్ని ఓటర్లకు తెలియజేయడం, ఓటరు నమోదు, పోలింగ్ కేంద్రం చిరునామా, ఎన్నికల సమాచారం, 24 గంటలు ఓటర్లకు సహాయం అందించడం వంటి సేవలు ఇందులో ఉంచినట్లు సంబంధిత శాఖ అధికారులు వివరించారు.

ఎన్నికల ప్రక్రియ సజావుకు చర్యలు

ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు నిబంధనల పక్కాగా అమలు కావాల్సిందే. ఉల్లంఘనకు తావిస్తే సరైన అభ్యర్థులు ఎన్నికయ్యే అవకాశం ఉండదు. ఈ విషయంలో ఓటర్లు అప్రమత్తంగా ఉండాలి. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు గుర్తిస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలి. నిబంధనల ఉల్లంఘనపై 1950కి ఫిర్యాదు చేయాలి. ఫిర్యాదుదారులు వివరాలను వెంటనే రిటర్నింగ్ అధికారికి పంపి అక్రమాల కట్టడికి చర్యలు తీసుకుంటారు.

సద్వినియోగం చేసుకోవాలి

> 1950 ఓటరు సహాయ కేంద్రం సేవల్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రజల సహకారం ఉంటేనే ఎన్నికలు సజావుగా నిర్వ హించేందుకు అవకాశం ఉంటుంది. నిబంధనల ఉల్లంఘనపై ఏ సమయంలోనైనా నిర్భయంగా ఫిర్యాదు చేయాలి. ఓటరు జాబితాలో పేరు రాకపోయినా, పోలింగ్ కేంద్రానికి సంబంధించిన సందేహాలు తెలుసుకునేనందుకు వీలుంటుంది.
> – అఖిలేష్ రెడ్డి, ఓటరు సహాయ కేంద్రం నోడల్ అధికారి

వీడిన చిక్కుముడి

- దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థిగా చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఖరారు
- శ్రావణ్‌కుమార్‌రెడ్డికి ఎంపీ సీటు హామీ
- కత్తి కార్తికకు సైతం సముచిత స్థానం కల్పిస్తామంటూ భరోసా

దుబ్బాకటౌన్: గ్రూపు కుమ్ములాటలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన దుబ్బాక కాంగ్రెస్‌లో ఎట్టకేలకు టికెట్ చిక్కుముడి వీడింది. కొన్ని నెలలుగా దుబ్బాక కాంగ్రెస్‌లో మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి తనయుడు కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి కత్తి కార్తీక గ్రూపుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయిలో విభేదాలు నెలకొన్నాయి. ముగ్గురు నేతలు తమ అనుచరులతో నియోజకవర్గంలో పర్యటిస్తూ ఎవరికి వారే యమునా తీరు అన్నట్లుగా కార్యక్రమాలు చేపడుతుండడంతో కాంగ్రెస్ అధిష్టానానికి తీవ్ర తలనొప్పిగా తయారైంది. దుబ్బాక ఎమ్మెల్యే టికెట్ తమకు వస్తుందంటూ ముగ్గురు నేతలు జోరుగా ప్రచారం చేస్తుండటంతో క్యాడర్‌లో సైతం అయోమయం నెలకొంది.

చెరుకు శ్రీనివాస్‌రెడ్డికే టికెట్ ఖరారు

దుబ్బాక టికెట్‌పై కాంగ్రెస్ అధిష్టానం ప్రత్యేక సర్వేలతో పాటు ప్రజలతో ముగ్గురు నేతలకు ఉన్న అనుబంధాన్ని పరిగణలోకి తీసుకొని చివరకు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పేరునే ఖరారు చేసినట్లు తెలిసింది. దుబ్బాక టికెట్ కోసం ఈ ముగ్గురు నేతలతో పాటు పీసీసీ సీనియర్ నాయకులు మద్దుల సోమేశ్వరెడ్డి కుమారుడు గాల్‌రెడ్డి సైతం దరఖాస్తు చేసుకున్నప్పటికీ టికెట్ విషయంలో మాత్రం ముగ్గురి మధ్యనే తీవ్ర పోటీ నెలకొంది. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో పాటు జనంలో సైతం శ్రీనివాస్‌రెడ్డికి అనుకూలంగా ఉందని తేలడంతో ఆయన పేరునే చివరికి అధిష్టానం ఖరారు చేసినట్లు తెలిసింది.

శ్రావణ్‌కు ఎంపీ సీటు హామీ

ఎమ్మెల్యే టికెట్ కోసం కర్ణాటక కాంగ్రెస్ కీలకనేత, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో పన్యాల శ్రావణ్‌కుమార్‌రెడ్డి బెంగళురులోనే మకాం వేసి వారం రోజులుగా తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. చివరికి శ్రావణ్‌కుమార్‌రెడ్డికి అధిష్టానంతో పాటు డీకే శివకుమార్ సైతం ఎంపీ సీటు ఇస్తామని బుజ్జగించడంతో పాటు కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీతో ఫోన్‌లో మాట్లాడించినట్లు తెలిసింది. రాహుల్ హామీతో శ్రావణ్ ఒప్పుకున్నట్లు తెలిసింది, కత్తి కార్తీకకు సైతం సముచిత స్థాన కల్పిస్తామని అధిష్టానం హామీనివ్వడంతో శాంతించినట్లు తెలిసింది.

బీజేపీలో గందరగోళం

- మెదక్‌కు ఖరారు కాని అభ్యర్థి
- కేటాయించిన నర్సాపూర్‌లో అసమ్మతి సెగలు



మెదక్: ఎన్నికల్లో భాగంగా బీజేపీలో అసమ్మతి గళం వినిపిస్తోంది. పార్టీ అధిష్టానం మెదక్ నియోజకవర్గానికి అభ్యర్థిని ఖరారు చేయకపోగా, నర్సాపూర్ టికెట్‌ను మురళీయాదవ్‌కు కేటాయించారు. దీంతో పార్టీలో నిరసన సెగలు మొదలయ్యాయి. ఆయన అభ్యర్థిత్వాన్ని పార్టీ నియోజకవర్గ నాయకులు వ్యతిరేకిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో మద్దతు పలుకమని, అవసరమైతే బీజేపీ రెబల్ అభ్యర్థిని బరిలో దింపుతామంటూ ఆందోళన చేస్తున్నారు. నర్సాపూర్ బీజేపీ టికెట్ కోసం మురళీయాదవ్‌తోపాటు సింగాయిపల్లి గోపి, మల్లేశ్‌గౌడ్, రఘువీరా రెడ్డి దరఖాస్తులు చేసుకున్న విషయం తెలిసిందే. ఆ పార్టీ నాయకుల్లో అంతర్గత గొడవలు ఉండడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. మెదక్‌లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ప్రచారంలో దూకుడు పెంచగా, బీజేపీకి అభ్యర్థి లేక ప్రచారం ఊసే లేదు. ఇప్పటికే టికెట్ కోసం తాళ్లపల్లి రాజశేఖర్, గడ్డం శ్రీనివాస్, నందు జనార్దన్‌రెడ్డి, నందారెడ్డి, కరణం పరిణీత, పంజా విజయ్‌కుమార్ దరఖాస్తు చేసుకున్నారు. పార్టీ అధిష్టానం మాత్రం ఎవరికి టికెట్ కేటాయిస్తుందో అని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

వేర్వేరు చోట్ల అలయ్-బలయ్

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పోతులబోగుడలో, వట్‌పల్లిలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ



వట్‌పల్లిలో పోటాపోటీగా నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు

వట్‌పల్లి(అందోల్): వేర్వేరు చోట్ల అలయ్–బలయ్ కార్యక్రమాన్ని బీఆర్‌ఎస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీలు నిర్వహించాయి. మండలంలోని పోతులబోగుడ గ్రామ సమీపంలో బీఆర్‌ఎస్ పార్టీ, వట్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయా పార్టీల కార్యకర్తలు హాజరయ్యారు. శుక్రవారం రెండు పార్టీల కార్యక్రమాలు నిర్వహించడంతో నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో ఇరుపార్టీల నాయకులు వట్‌పల్లికి చేరుకున్నారు. మధ్యాహ్నం 4 గంటల సమయంలో అలయ్–బలయ్ ముగిసిన తర్వాత బీఆర్‌ఎస్ కార్యకర్తలు వట్‌పల్లి మీదుగా వెళ్తుండగా అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ కార్యకర్తలు ఎదురుపడ్డారు. దీంతో ట్రాఫిక్ జామ్ అవడంతో ఆ పార్టీల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. దర్గాలో ప్రార్థనల అనంతరం దామోదర్ చౌరస్తాకు చేరుకగానే ఇరుపార్టీలకు చెందిన వారు జై బీఆర్‌ఎస్..జై కాంగ్రెస్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ కోటేశ్వర్‌రావు సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేయడానికి నానా తంటాలు పడ్డారు. గంటకు పైగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనాలు వెళ్లే వరకు అవాంఛనీయ సంఘటనలు జరగకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. శుక్రవారం సంత కావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి
- ఓట్ల లెక్కింపు కేంద్రాల పరిశీలన



కౌంటింగ్ సెంటర్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

పరిగి: ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓట్ల లెక్కింపు కేంద్రాలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు, నీటి వసతి ఉండేలా చూసుకోవాలన్నారు. ఎన్నికల సిబ్బంది, పోలింగ్ ఏజెంట్ల వాహనాల పార్కింగ్ కోసం స్థలం కేటాయించాలని సూచించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఎప్పటికప్పుడు మీడియాకు చేరవేసేందుకు ఏర్పాట్లు చేయాలని, ప్రతి సెంటర్ వద్ద మీడియా పాయింట్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం స్ట్రాంగ్ రూంను పరిశీలించి సదుపాయాలపై ఆరా తీశారు. ఆర్‌ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంసీసీ కంట్రోల్ రూమ్, వ్యయ పరిశీలన సెల్, ఎంసీఎంసీ కమిటీల పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. వివిధ దిన పత్రికల్లో వస్తున్న ఎన్నికల వార్తలు, ప్రకటనల క్లిప్పింగులను ఎప్పటికప్పుడు పరిశీలించి రికార్డ్ చేసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యనాయక్, ఆర్‌ఓ విజయకుమారి పాల్గొన్నారు.

బకాయిల కోసం ఎదురుచూపు

ట్రైడెంట్ యాజమాన్య తీరుపై రైతుల్లో అసహనం
- ఆగస్టు నెలాఖరులోపు రూ.9 కోట్లు చెల్లిస్తామన్న హామీ తూచ్
- రెవెన్యూ యాక్టు అమలు కోసం
- ఆరు నోటీసులు జారీ చేసిన అధికారులు



ట్రైడెంట్ చక్కెర కర్మాగారం

చెరకు బకాయిల చెల్లింపుల వ్యవహారంలో పరిశ్రమ యాజమాన్యం కొన్ని కోట్ల రూపాయలు బకాయి పడింది. కార్మిక నేతలతో ఎన్నోసార్లు చర్చలు జరిపి చెల్లింపులకు అంగీకారం తెలపడం, ఆ తర్వాత తమకేమీ పట్టనట్లు వ్యవహరించటం సాధారణమైంది. ఇది రైతులకు శాపంగా మారుతోంది. అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టామని రానురానూ వడ్డీ భారం ఎక్కువవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జహీరాబాద్: చెరకు బకాయిలను చెల్లించకుండా ట్రైడెంట్ యాజమాన్యం దాటవేస్తూ వస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు ఇచ్చిన గడువులు సైతం దాటిపోయాయని గుర్తు చేస్తున్నారు. 2022–23 క్రషింగ్ సీజన్‌కు సంబంధించిన రూ.9 కోట్ల మేర బకాయిలున్నాయి. పలుమార్లు మంత్రి హరీశ్‌రావు బకాయిల విషయమై ఎప్పటికప్పుడు స్పందించి సంస్థ ప్రతినిధులతో చర్చలు జరిపి చెల్లించేలా ఒప్పించారు. అంతలోనే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఈ అంశం మరుగున పడింది. జూలై 12న మంత్రి.. సంగారెడ్డి కలెక్టరేట్‌లో యాజమాన్యంతోపాటు కర్మాగారంలో భాగస్వాములుగా చేరిన వారితో చర్చలు జరిపారు. మొత్తం బిల్లులను ఆగస్టు నెలాఖరు లోగా చెల్లిస్తామని హామీ ఇచ్చింది. ఈరోజు వరకు కూడా స్పందించక పోవడం పెట్టుబడుల కోసం అప్పులు తెచ్చామని, వాటికి వడ్డీలు పెరిగిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఆరు నోటీసులను జారీ చేశామని అధికారులు చెబుతున్నారు. చివరిదైన 7వ నోటీసు ఇచ్చాక రెవెన్యూ యాక్ట్ చట్టాన్ని ప్రయోగిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. సంస్థ అనుసరిస్తున్న విధానాలను బట్టి చూస్తే వచ్చే సీజన్‌లో క్రషింగ్‌ను కొనసాగించడం అనుమానంగానే కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

2.55 లక్షల టన్నుల క్రషింగ్

ట్రైడెంట్ కర్మాగారంలో 2022–23 క్రషింగ్ సీజన్‌కు గాను 2.55 లక్షల టన్నుల చెరకును గానుగాడించింది. టన్నుకు రూ.3,270 ధర నిర్ణయించింది. మొదటి విడత కింద టన్నుకు రూ.3వేల వంతున చెల్లిస్తూ వచ్చింది. మిగతా రూ.270 పెండింగ్ పెట్టింది. జనవరి నెలాఖరు, ఫిబ్రవరి మాసంలో చెరకును సరఫరా చేసిన 2,287 మంది రైతులకు మాత్రం పూర్తి స్థాయిలో బిల్లులు బకాయి పడింది. ఇందులో 1,699 మంది రైతులకు టన్నుకు రూ.270 వంతున బకాయి పడింది. రూ.83 కోట్లకు గాను ఇప్పటి వరకు సుమారు రూ.74కోట్ల మేర బిల్లులు చెల్లించింది. ఇంకా రూ.9 కోట్ల మేర చెల్లించాల్సి ఉంది.

రెవెన్యూ యాక్ట్ ప్రయోగిస్తాం



> రైతులకు రావాల్సిన చెరకు బకాయిలను ఇప్పించేందుకు గాను మా వంతు ప్రయత్నాలు చేస్తున్నాం. రెవెన్యూ యాక్ట్ చట్టాన్ని ఉపయోగించేందుకు వీలుగా చర్యలకు ఉపక్రమించాం. ఇప్పటికే ఆరు నోటీసులను జారీ చేశాం. కర్మాగారంలో మరమ్మతులు పనులయితే యాజమాన్యం చేయిస్తోంది. ప్రస్తుతం బకాయిలను ఇప్పించడంపైనే దృష్టి పెట్టాం. బకాయిల విషయంలో రైతులు ఆందోళన చెందవద్దు.
> – రాజశేఖర్, కేన్ అసిస్టెంట్ కమిషనర్, సంగారెడ్డి

అన్నపూర్ణగా తెలంగాణ

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: ఒకప్పుడు కరువుతో అల్లాడిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంతో అన్నపూర్ణగా మారిందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 15వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నామని, కేసీఆర్ పాలనలో ఇవి సాకారమయ్యాయని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుబంధు, రైతు బీమా పథకాలు తెచ్చి అన్నదాతలకు అండగా నిలిచినట్లు తెలిపారు. సాగునీరు, వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వడంతో పంటలు పుష్కలంగా పండుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో పంట దిగుబడి భారీగా పెరిగింద న్నారు. తెలంగాణ ప్రజలు బీఆర్‌ఎస్ వైపే ఉన్నారన్నారు. ప్రభుత్వ పథకాలు అందని ఇల్లు అంటూ లేదని పేర్కొన్నారు. తనను మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, కోఆప్షన్ జిల్లా మాజీ సభ్యుడు మీర్ మహమూద్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి

- పెండింగ్ సమస్యలను పరిష్కరించా
- ప్రతి వార్డుకు రూ. కోటి మంజూరు చేశా
- మరోసారి ఆశీర్వదించండి
- ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి
- వార్డుల్లో పాదయాత్ర



తాండూరులో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు టౌన్: పట్టణంలో జరిగిన అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని స్థానిక ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ తాండూరు అసెంబ్లీ అభ్యర్థి పైలెట్ రోహిత్‌రెడ్డి ప్రజలను కోరారు. పట్టణంలో పైలెట్ పాదయాత్ర పేరిట శుక్రవారం పలు వార్డుల్లో పర్యటించారు. మొదట పాత తాండూరులోని శ్రీ కోటీశ్వర ఆలయం, నిజాంషాహీ దర్గాలో ప్రార్థనలు చేసి 14వ వార్డు నుంచి పాదయాత్రను ప్రారంభించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల మేనిఫెస్టోలో పొందు పరిచిన పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏళ్ల తరబడిగా తాండూరు పట్టణం అభివృద్ధికి నోచుకోలేక పోయిందన్నారు. ఈ ఐదేళ్లలో పట్టణ రూపురేఖలు మార్చేశానని అన్నారు. ప్రతి వార్డు అభివృద్ధికి రూ. కోటి చొప్పున నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించినట్లు వివరించారు. వరద నీటితో పలు వార్డుల ప్రజలు ఇబ్బందులు పడేవారని, చిలకవాగు కాలువలకు మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. ఆదర్శనగర్‌లో కేసీఆర్ థీమ్ పార్కు, పాత తాండూరులో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించామని అన్నారు. మాతా శిశు ఆసుపత్రి, బస్తీ దవాఖానాలతో పేదలకు కార్పొరేట్ వైద్యం అందేలా చూశానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. మూడోసారి కేసీఆర్ సీఎం కావడం ఖాయమన్నారు. అభివృద్ధే లక్ష్యంగా సాగుతున్న తనను ప్రస్తుత ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, వైస్ చైర్‌పర్సన్ దీప, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వీణ, రాష్ట్ర నాయకులు కరణం పురుషోత్తంరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు నయీమ్, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు సంగీత, వర్కింగ్ ప్రెసిడెంట్ పరిమళ, మాజీ అధ్యక్షురాలు అనురాధ, కౌన్సిలర్లు శోభారాణి, అశ్విని, బాంబిన, ఎమ్మెల్యే సతీమణి ఆర్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మా అభ్యర్థులు లేనిచోట బీఆర్‌ఎస్‌కు ఓటేయండి

ముస్లింలకు ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ పిలుపు



మాట్లాడుతున్న ఎంఐఎం అధినేత అసదుద్దీన్

జహీరాబాద్ టౌన్: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇస్తున్నామని ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో శుక్రవారం రాత్రి నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. ఎంఐఎం పోటీ చేయని నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్‌కు ఓటేయాలని ముస్లింలకు పిలుపునిచ్చారు. తమ పార్టీ అభ్యర్థి ఉన్న చోట గాలిపటంకు ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు జరగని అభివృద్ధి తొమ్మిదేళ్లలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేసి చూపించారని కితాబిచ్చారు. జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ స్థానికుడు కాదని, వికారాబాద్ నుంచి వలస వచ్చాడని ఎద్దేవా చేశారు. ఆయన ఆర్‌ఎస్‌ఎస్ వ్యక్తని, నాలుగేళ్లు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌తో కలిసి పనిచేశారని విమర్శించారు. జహీరాబాద్ ముస్లింలు కాంగ్రెస్ నాయకుల మాటలను నమ్మకుండా బీఆర్‌ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జహీరాబాద్‌కు సీఎం కేసీఆర్‌ను తీసుకొచ్చి గల్లీ గల్లీలో తిప్పుతానని, ఉర్దూ మీడియం బీఎడ్ కళాశాలను మంజూరు చేయిస్తానని అసద్ హామీ ఇచ్చారు. బీజేపీ, కాంగ్రెస్‌లు నాణానికి రెండు ముఖాలన్నారు. కాంగ్రెస్, ఆర్‌ఎస్‌ఎస్‌కు అమ్ముడుపోయిందని, ఓ రచయిత రాసిన పుస్తకాన్ని ఆయన ప్రజలకు చూపించారు. తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ఆర్‌ఎస్‌ఎస్‌తో సంబంధం ఉందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో తిరిగారని, గతంలో కిషన్‌రెడ్డి పోటీ చేస్తే ఆయన గెలుపు కోసం రేవంత్‌రెడ్డి ప్రచారం చేశారన్నారు. గాజాలో ఇజ్రాయిల్ దాడులపై ఒవైసీ మండిపడ్డారు. ఇజ్రాయిల్ గాజాపై దాడులు చేస్తూ అమాయకులను పొట్టన పెట్టుకుంటుందని వాపోయారు. దీనిపై బీజేపీ, కాంగ్రెస్ రెండు పార్టీలు ఎందుకు మాట్లాడడంలేదన్నారు.